# బీఆర్ఎస్ హుషారు.. కాంగ్రెస్ బేజారు

### బీఆర్ఎస్ పార్టీలో చేరికల జోష్..

మేడ్చల్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండటంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పార్టీ అభ్యర్థులు నిర్వహిస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం కనపడుతోంది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులైన మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని మరింత రెట్టింపు ఉత్సాహంతో నిర్వహిస్తున్నారు.

### భిన్నంగా కాంగ్రెస్ పరిస్థితి ..

ఇందుకు భిన్నంగా జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి నెలకొంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరిని ప్రకటించినప్పటికీ ప్రచారం మాత్రం అంతంత మాత్రంగా సాగుతోంది. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నిరుత్సాహం ఏర్పడింది. అభ్యర్థులను ప్రకటించిన ప్రతి నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలు మరింత రాజుకుని ఆ పార్టీ టికెట్ ఆశించిన అభ్యర్థులతో పాటు ముఖ్య నాయకులందరూ రాజీనామా చేసిన విషయం విధితమే. నామినేషన్ల గడువు సమీపిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు గ్రూప్ రాజకీయాలు సద్దుమనగలేదు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి ఉంటే ఆ పార్టీకి గడ్డుకాలమేనని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలతో మంత్రి మల్లారెడ్డి

### బీఆర్ఎస్‌లో చేరికల జోష్..

సీఎం కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీలో జోరుగా చేరికలు జరుగుతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని శామీర్‌పేట్ మండలం తుర్కపల్లి గ్రామం బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో వరప్రసాద్‌రెడ్డి, రవుఫ్, ప్రసాద్, మధుసూదన్, 30 మంది కార్యకర్తలు ఉన్నారు. అలాగే నాగారం మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 500 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

## పద్మారావుకు జనం జేజేలు



ప్రచారంలో ముస్లిం మైనార్టీ చిన్నారులతో పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 28: ప్రజల కోసం పని చేసే నాయకులకు మంచి గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు సంఘాల నేతలు పద్మారావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రజలు జేజేలు కొడుతూ మా ఓటు నీకే నంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. గత పాలకులు చేయలేని అభివృద్ధి పనులను తమ హయాంలోనే పూర్తి చేశామన్నారు. ప్రచార పాదయాత్ర వినోభానగర్, నఫీజ్ గార్డెన్స్, ఆర్యనగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో కొనసాగింది. పద్మారావుకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ప్రచార పాదయాత్రలో పాల్గొన్నారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు కందిశై లజ, హేమ, సునీత, ప్రసన్నలక్ష్మీలతో పాటు పద్మారావు గౌడ్ తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్ ప్రచారం నిర్వహించారు.

## ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 28: ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మల్కాజిగిరి, మచ్చ బొల్లారం, మౌలాలి, అల్వాల్, నేరేడ్‌మెట్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో మర్రి రాజశేఖర్ రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం పలు డివిజన్లలో నిర్వహించిన సమావేశాల్లో రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తానన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఆరోగ్య బీమా రూ.5లక్షలు, ఆసరా పింఛన్ల పెంపు, రేషన్‌పై సన్న బియ్యం, వంట గ్యాస్ రూ.400లు, అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేత, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు నెలనెలా రూ.3వేలు గెలిచిన తరువాత అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, మీనాఉపేందర్ రెడ్డి, సునీతారాము యాదవ్, మురుగేశ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఆకుల నర్సింగరావు, అనిల్‌కిశోర్, డోలీ రమేశ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి



మోండా డివిజన్‌లో టైలర్‌షాపులో వస్త్రాలు కుట్టి ప్రచారం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.లాస్యనందిత

కంటోన్మెంట్, అక్టోబర్ 28 : అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. శనివారం నియోజకవర్గంలోని మోండా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ ఆకుల రూపతో కలిసి లాస్యనందిత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ... నా తండ్రి సాయన్న ఆకస్మిక మరణం తరువాత నుంచి నేను ప్రజల వెంటే ఉన్నానని, కష్టాలు, బాధల్లో పాలు పంచుకున్నానని తెలిపారు. ప్రజల కష్టాల్లో కనపడని వ్యక్తులు, కరోనా సమయంలో ఆదుకోని వారు మనకు అవసరమా అని ప్రశ్నించారు. కొనసాగుతున్న అభివృద్ధి ఆగకూడదు అంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ పాదయాత్రలో సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకురాలు నివేదితతో పాటు నేతలు చిన్న, అజయ్, శేఖర్, భవాని, అనిత, సువర్ణ, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లికార్జున నగర్‌లో కిరాణా షాపు యజమానికి ఎన్నికల మ్యానిఫెస్టోను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

అంబర్‌పేట, అక్టోబర్ 28: తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూనే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున నగర్, సాయిబాబా టెంపుల్ లేన్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించానని, అందుకే ఓటు అడుగుతున్నానన్నారు. నియోజకవర్గంలో ఏ బస్తీకి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. తాను చేసిన అభివృద్ధితో పాటు ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాల వల్లే తనకు ఈ స్పందన వస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తున్న సమయంలో వారి ముఖంలో ఆనందం కనిపిస్తున్నదని, సీఎం కేసీఆర్‌తోనే ఇవి సాధ్యమని ప్రజలే చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## గులాబీ జెండా ఎగురవేస్తాం



షేక్‌పేట్ డివిజన్ వినోభానగర్-2లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

షేక్‌పేట్ అక్టోబర్ 28 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేస్తామని హైదరాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం షేక్‌పేట్ డివిజన్‌లోని వినోభానగర్-2లో ఎమ్మెల్యే ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజల సంపూర్ణ మద్దతు తనకే ఉందని, తాను ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులకు అందించామన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ నయవంచనకు చిరునామా

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

మణికొండ, అక్టోబర్ 28: కాంగ్రెస్, బీజేపీల నాయకులు మభ్యపెట్టేందుకు వస్తున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మొద్దని రాజేంద్రనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆ పార్టీలు నయవంచనకు చిరునామా అని ఆయన విమర్శించారు. మణికొండ మున్సిపాలిటీలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అలాగే మణికొండ ప్రాంతానికి చెందిన వందలాది మంది కాంగ్రెస్, బీజేపీల నుంచి నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... గడిచిన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ప్రతి ఇంటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని, అవి కళ్లముందే కన్పిస్తున్నాయని చెప్పారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని సూచించారు. ఏనాడైనా ప్రజల సమస్యలు తెలుసుకున్నారా? గ్రామాల్లో పర్యటించిన దాఖలాలున్నాయా? అని ప్రశ్నించారు. మౌలిక వసతులు, శాశ్వత తాగునీటి సమస్యలను పరిష్కరించామన్నారు.ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మల్లేశ్, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, మజ్లిస్ అభ్యర్థులనే గెలిపిస్తారు

### ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల అభ్యర్థులనే గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పనున్నారని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చి బీసీలకు అండగా ఉంటామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే మరెందుకు బీసీ గణన చేయడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ సాక్షిగా ఈ విషయాన్ని తాను అడిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల కోసం రాష్ట్రానికి వచ్చి వెళుతున్న కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.